# ఎవరీ రెవరెండ్లు ?

భూమికి పునాదివేసినప్పటి నుండి పరమతండ్రి అనేకమంది ప్రవక్తలను, యాజకులను, రాజులను, అపోస్తలులను అనేకమందిని తన కార్యములను జరుపుటకై ఏర్పరచుకొనియున్నాడు. అయితే వీరిలో ఎవరునుకూడా పరమతండ్రితో సమానులైనవారుకారు. అందుకే వాళ్ళు ప్రవక్తలుగాను, అపోస్తలులుగాను, శిష్యులుగాను పిలువబడినారు. కాని ఈనాటి నవీన క్రైస్తవ తరములో అనేకమంది బోధకులు ప్రవక్తల కంటే గొప్పవారిగా, అపోస్తలులకంటే అధికులుగా పిలుపించుకోవాలనే కాక పరమతండ్రితో సమానులుగా ఎంచుకొని పరిశుద్ధవాక్యమునకు విరోధముగా ప్రవర్తించుచున్నారు. ఈ వాక్యవ్యతిరేక బోధకులు అందరు వారి పేర్లకు ముందు రెవరెండ్ అని, రైట్ రెవరెండ్ అని, మోస్ట్ రెవరెండ్ అని, ఫాదర్ అని, అయ్యాగారు అని, జయశాలి అని, ఆచార్య అని, ఆత్మజ్ఞాని అని, దైవజ్ఞాని అని, వేదరత్న అని ప్రత్యేక బిరుదులు వ్రాసుకొనుచున్నారు. ఇలా వ్రాసుకొనకపోతే బోధలు చెయ్యలేకపోతున్నారు. ఇది ఎంత అక్రమమో పరిశీలిద్దాం.

రెవరెండ్ అనగా పూజింపదగినవాడు, పూజార్హుడు అని అర్థం అయితే పూజింపదగినవాడు ఒక్కడే పరమతండ్రి అయిన యావె మాత్రమే. ఆయనను తప్ప మరి ఎవరిని మనం పూజింపరాదు (నిర్గమ 20:1-4) ఇప్పుడు రెవరెండ్‌లు అని పిలుచుకొనే వాళ్ళు అందరు మేము పూజింపదగినవాళ్ళము మమ్ములనే పూజించండి అని చెప్పుకొనుచున్నారు. వీళ్ళు అందరూ సాతాను బాటలో ఉన్నారు. ఏవిధంగా అనగా సాతాను కూడా పరమతండ్రి అయిన యావెతో పోల్చుకొని ఆయన సింహాసనము కంటే ఎత్తుగా ఉండాలనే ఆశించి క్రిందకు కూలద్రోయబడినాడు. వానికి లోబడిన వాళ్ళే వీళ్ళందరు. (యెషయా 14:12-15) క్రిందకు త్రోయబడిన సాతాను తన కార్యమును ఇక్కడ నెరవేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నది. సాతాను వీళ్ళలో దూరి పరమతండ్రి ఘనతను పొందుకోవాలని ఆశిస్తున్నది. ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగుదూత వేషము ధరించుకొనుచున్నాడు. (2 కొరిం. 11:14). గనుక సాతానే వీళ్ళలో ఉండి నేనే రెవరెండ్‌ను నన్నే పూజించండి, నేనే తండ్రిని నన్నే ఫాదర్ అని పిలవండి, నేనే గురువును నన్నే ఆచార్య అని పిలవండి అని వాక్యం ద్వారానే క్రైస్తవలోకాన్ని అనేక వాక్యవ్యతిరేక సిద్ధాంతాలతో, విధానాలతో మోసగిస్తున్నది. దీని ఉచ్చులో ఉన్నవాళ్ళు వీళ్ళే ఈ రెవరెండ్లు, ఫాదర్లు ఈరకమైన వాళ్ళు అందరు. కాని ఆయన నిజమైన సేవకులు ఎవరూ ఈ విధంగా పిలువబడరు. ఆయన వాక్యం సెలవిచ్చిన రీతిగానే ఉంటారు. **"అటువలె మీరును మీకు ఆజ్ఞాపించబడినవన్నియు చేసిన తరువాత - మేము నిష్ ప్రయోజకులమైన దాసులము, మేము చేయవలసినవే చేసియున్నామని చెప్పుడనెను (లూకా 17:10).**

ఆయన ద్వారా నడిపించబడే వాళ్ళు ఆయన చెప్పినట్లుగా నిష్ ప్రయోజకులమైన దాసులము మా ద్వారా కాదు అన్ని కార్యములు పరమతండ్రి ద్వారానే జరుగుచున్నవని చెబుతారు. బాప్తిస్మమిచ్చు యెహాను చెప్పుచున్నాడు. - ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను (మత్తయి 3:11). బాప్తీస్మమిచ్చు యోహాను నేనే రెవరెండ్‌ను నేనే బాప్తీస్మాన్ని తెచ్చాను నన్ను పూజించండి అని అనలేదు. పేతురు తనకు పాదనమస్కారము

చేసిన కొర్నేలితో అందుకు పేతురు – నీవు లేచి నిలువుము. నేను కూడ నరుడనేనని చెప్పి, అతని లేవనెత్తెను (అ॥కార్య 10:26). ఇది పేతురు యొక్క విధేయత. నేనే రెవరెండ్‌ని నీవు ఒక్కడవే కాదు నీ వద్ద ఉన్నవాళ్ళు అందరును నా పాదములకు నమస్కారం చేయండి అని అనలేదు. నేడున్న ఈ సాతాను రెవరెండ్లను వాక్యంతో పోల్చిచూడండి. మనం పూజించవలసినది పరమతండ్రి అయిన యావేనా? లేక ఈ మూర్ఖపు జనాంగములనా?

యోహాను దూతకు నమస్కరించుటకు సాగిలపడగా అతడు వద్దుసుమీ! నేను నీతోను ప్రవక్తలైన నీ సహోదరులతోను ఈ గ్రంథమందున్న వాక్యములను గైకొనువారితోను సహదాసుడను ఎలోహింకే నమస్కారము చేయుమని చెప్పెను (ప్రకటన 22:8,9). ఇది వాక్య విధేయుల యొక్క క్రమము కాని నేటి వారిని పరిశీలించండి అది సాతాను క్రమమని తెలుస్తుంది. సౌలు లుస్త్రలో బలహీన పాదములు గల వానిని స్వస్థపరచినందున ద్యుపతి, హెర్మే అని బర్నబాకును, సౌలుకును పేర్లు పట్టి వారికి యెడ్లను బలిఇచ్చుటకు ప్రయత్నించినపుడు సౌలు చెప్పుచున్న మాటలు, “అయ్యలారా మీరెందుకిలాగు చేయుచున్నారు? మేము కూడా మీ స్వభావం వంటి స్వభావం గల నరులమే. సమస్తమును సృజించిన జీవంగల ఎలోహిం వైపు తిరుగుడని వారికి చెప్పెను (అ॥కార్య. 14:15) ఇది సౌలు విధేయత.

సాతాను తంత్రములను ఎరుగని వాళ్ళు మాత్రమే ఈ రకమైన బిరుదులకు ప్రలోబపడి దానికి దాసులవుతారు. ఇది చాలా మందికి అర్థంకాని విషయం. సాతాను పరమతండ్రి ప్రజలను తన ప్రజలుగా చేసుకుంటానని, పరమతండ్రి ఘనతను తాను తీసుకుంటానని, నేనే వాళ్ళకు తండ్రిగా పిలువబడతానని, పరమతండ్రి ఆజ్ఞలను మార్చి తన ఆజ్ఞలను ఏర్పరచి ఆయనకు దూరంచేస్తానని ప్రతిజ్ఞ చేసినది. దానిని నేడు ఇటువంటి వాళ్ళతో సాధించుకొనుటకు, కార్యం చేయుటకు ప్రయత్నిస్తున్నది. కనుక దీనిని బట్టి రెవరెండ్ అని వాక్య వ్యతిరేకముగా పిలుపించుకొనేవాళ్ళు ఎవరో అర్థం చేసుకోవాలి వాళ్ళు బోధకులు కారని ఆ రూపంలో ఉన్న సాతానే అని వాక్యం ద్వారా ఋజువుఅవుచున్నది. కనుక పరమతండ్రి సంబంధులు ఎవరూ రెవరెండ్ అని పిలుచుకోలేదు. నేడు అనేకమంది బోధకులలో ఈ ఎక్కువ తక్కువలు వారి హృదయములలో ఉండబట్టే ఈ తారతమ్యములకు ఆస్కారము వచ్చుచున్నది. నిజముగా ఆయన వాక్యమునకు విధేయులైన వారు, నిజముగా ఆయన మాటలకు లోబడివారు ఈ వాక్యమును బట్టి ప్రవర్తించువారై యుండాలి. ( లూకా 22:26). ఆయన తీర్పు దినమందు ఈ రైట్ రెవరెండ్లు, మోస్ట్ రెవరెండ్లు, ఫాదర్‌లు, అయ్యగార్లు, జయశాలులు, ఆచార్యులు, వేదరత్నలు అందరు ధూళి వంటివారై నిర్ణయించబడిన ఆరని అగ్నికి పోవుదురు (మత్తయి 7:23).

నరుల అహంకార దృష్టి తగ్గింపబడును. మనుష్యుల గర్వము అణగ ద్రొక్కబడును

ఆ దినమున యావె మాత్రమే ఘనత వహించును – యెషయా 2:11, సత్యము, జీవమునైన యషువ మార్గములోనికి రండి పూజార్హుడైన యావె తండ్రినే పూజించండి. అట్టి హృదయమును తండ్రి యషువ మీకు దయచేయును గాక!

వివరములకు వ్రాయండి సంప్రదించండి :

**A.O.T.L.E**

**మలికిపురం - 533 253, ఫోన్ : 08862-227613, సెల్ : 9908831613**